

హరి హర క్షేత్రం.. పుష్పగిరి
జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన పుణ్య క్షేత్రాలలో ఒకటైన పుష్పగిరిలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తులు భారీగా తరలి రానున్నారు. - 8లో



ప్రాణం తీస్తున్న పింఛన్
పింఛన్ డబ్బులు వృద్ధుల ప్రాణం మీదికొస్తున్నాయి. చంద్రబాబు పుణ్యమా అని ఈ డబ్బును తీసుకోవడానికి వృద్ధులు నానా యాతన పడుతున్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
45.4/31.4

వాతావరణం
జిల్లాలో శనివారం 31.4 – 45.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు
కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని వివిధ విద్యా సంస్థల్లో 2024 సంవత్సరం 10వ తరగతిలో 550 ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమాన్ని 5వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు కడపలోని అపూర్వ కల్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం 9248722218, 7995330102 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

స్ట్రాంగ్ రూములో ఈవీఎంల పరిశీలన

స్ట్రాంగ్ రూములో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్: పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాల స్ట్రాంగ్ రూములో ఉన్న ఈవీఎంలను జిల్లా కలెక్టర్ విజయరామరాజు శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశులు, ఎమ్మార్వోలు, ఆర్ఐలు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

నక్కలదిన్నె పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ ఉమా మహేష్ కుమార్

చాపాడు: 0–16 ఏళ్ల లోపల ఉండే చిన్నారులకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకా లు తప్పనిసరిగా వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేష్ కుమార్ తెలిపారు. మండలంలోని నక్కలదిన్నె, సీతారామాపురం గ్రామాలలో జరిగిన టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం చాపాడు, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా చిన్నారులకు టీకా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్‌కుమార్, కావ్య మాధురి, ఓబులేసు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను తనిఖీ చేసిన ఎన్నికల పరిశీలకులు

జాబితాను పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల పరిశీలకుడు బనుదాస్ పాల్వే

ముద్దనూరు: మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను కేంద్ర ఎన్నికల పరిశీలకుడు బనుదాస్ పాల్వే శనివారం తనిఖీ చేశారు. స్థానిక తహసీల్దార్ సువర్ణాదేవితో కలసి ఆయన మండలంలోని దేనేపల్లె, ఉప్పలూరు, వేల్పుచెర్ల తదితర గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. మారుమూల పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక వసతుల ఏర్పాటు ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు.

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాలు విడుదల

ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఈ

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ 1,3,5,7 సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి తన ఛాంబర్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎర్త్‌సైన్స్ మొదటి సెమిస్టర్‌లో 86.67 శాతం, మూడో సెమిస్టర్‌లో వంద శాతం, 5వ సెమిస్టర్‌లో వంద శాతం, 7వ సెమిస్టర్‌లో వంద శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఐదేళ్ల ఎంఎస్సీ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ పరీక్ష ఫలితాల్లో మొదటి సెమిస్టర్‌లో 92శాతం, మూడు, ఐదు సెమిస్టర్లలో వంద శాతం, 7వ సెమిస్టర్‌లో 82.35 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, డాక్టర్ గంగయ్య, ప్రొఫెసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పేరుకు స్వతంత్రులు..
టీడీపీతో చెట్టాపట్టాలు!

- పులివెందులలో టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి ప్రచారంలో స్వతంత్ర అభ్యర్థులు
- బీటెక్ రవి ప్రచారంలో అభ్యర్థి అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి
- టీడీపీ అభ్యర్థికి ఎస్కార్ట్ తరహాలో వ్యవహరిస్తున్న అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి
- మరో ఇద్దరిదీ ఇదే దారి


టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి వాహనంపై ఎస్కార్టు తరహాలో వేలాడుతూ వెళ్తున్న అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: వారంతా తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు. టీడీపీ చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొనే క్రియాశీలక కార్యకర్తలు. ఎన్నికల సంగ్రామంలో స్వతంత్ర అభ్యర్థులుగా కొందరు, గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థిగా మరికొందరు పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి కంటే మించి తెలుగుదేశం పార్టీ కోసం పనిచేస్తున్నారు. ఈ తతంగం పులివెందుల నియోజకవర్గంలో తెరపైకి వచ్చింది. కలిసికట్టుగా ఒకే వాహనంలో, ఒకే గ్రామంలో టీడీపీ కోసం ప్రచారం కొనసాగిస్తున్న ఉదంతమిది.

- పులివెందుల టౌన్‌కు చెందిన అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్త. పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా రెవెల్యూషనరీ సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఎన్నికల గుర్తుగా పార మరియు స్టోకర్ రిటర్నింగ్ అధికారి కేటాయించారు. అయితే ఎక్కడా తన గుర్తు తెలియజేస్తూ ఎన్నికల్లో ఓటు వేయాలని అభ్యర్థించడం లేదు. పైగా టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి విజయం కోసం పనిచేస్తున్నారు. ఈనెల 3న అంబకపల్లి, మురారిచింతల గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్తే బీటెక్ రవి కారుపై ఎస్కార్ట్ తరహాలో నిల్చొని గ్రామంలోకి ప్రవేశించారు. అక్కడే ఉన్న బీటెక్ రవి సోదరుడు భరత్‌కుమార్‌రెడ్డి కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈయనతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉన్న దేవిరెడ్డి సంజీవరెడ్డి, గోకనపల్లె వరప్రసాదరెడ్డిలు కూడా టీడీపీ అభ్యర్థి విజయం కోసం పనిచేస్తున్నారు. సంజీవరెడ్డి టీడీపీ అభ్యర్థి బీటెక్ రవితో కలిసి స్వయంగా టీడీపీలో చేరికల్లో పాల్గొన్నారు. మురారిచింతల గ్రామంలో టీడీపీ ఎన్నికల ప్రచారం సైతం కలిసికట్టుగా చేపట్టారు. గోకనపల్లె వరప్రసాదరెడ్డి ఏకంగా టీడీపీ టోపి పెట్టుకొని ఎన్నికల ప్రచారం చేపట్టడం విశేషం. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్న ఇలాంటి స్వతంత్ర అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


టీడీపీ టోపి ధరించి ఎన్నికల ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గోకనపల్లె వరప్రసాదరెడ్డి


బీటెక్ రవితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్వతంత్ర అభ్యర్థి సంజీవరెడ్డి

నేడు పోలింగ్ సిబ్బందికి
పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- జిల్లాలో ఎనిమిది ఫెసిలిటేషన్ కేంద్రాలు
- పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్న 13,536 మంది జిల్లా ఎన్నికల సిబ్బంది
- 3570 మంది ఇతర జిల్లాల ఉద్యోగులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


జయనగర్‌కాలనీలోని పాఠశాలలో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులతో చర్చిస్తున్న ఆర్డీఓ

కడప సెవెన్‌రోడ్స్: కడప లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా తొలుతగా జిల్లాలోని 13,536 మంది పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటును ఆదివారం వినియోగించుకోనున్నారు.. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 3955 మంది, ఇతర పోలింగ్ అధికారులు 9249 మంది, మైక్రో అబ్జర్వర్లు 332 మంది వీరిలో ఉన్నారు. అలాగే జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటరుగా నమోదైన 3570 మంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా పోస్టల్ బ్యాలెట్ల ద్వారా ఓటు నమోదు చేయనున్నారు. గతంలో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ వినియోగం కోసం జిల్లా కేంద్రంలో మాత్రమే ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఇందువల్ల అనేక వ్యయ ప్రయాసలు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనే ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. ఇతర జిల్లాలకు చెంది అక్కడ ఓటర్లుగా రిజిస్టర్ అయి ఈ జిల్లాలో పనిచేస్తున్న వారికోసం కడప జయనగర్ కాలనీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు

ఫెసిలిటేషన్ కేంద్రాల్లో గెజిటెడ్ అధికారి, పీఓ, ఏపీఓ, ఓపీఓ తదితర సిబ్బందిని నియమించారు. బారికేడ్లు, ర్యాంపు, తాగునీరు, పారిశుధ్యం, ఫర్నీచర్, విద్యుత్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఫెసిలిటేషన్ కేంద్రం లోపలికి వెళ్లేందుకు వీలుగా ప్రవేశమార్గం, ఓటు వినియోగం తర్వాత వెలుపలికి వచ్చేందుకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా ఫెసిలిటేషన్ కేంద్రాల్లోకి వచ్చి పోలింగ్ ఎలా జరుగుతుందో పరిశీలించి వెళ్లేందుకు అవకాశం కల్పించారు. అభ్యర్థులు కాకుండా ఇతరులు లోనికి వెళ్లేందుకు అనుమతించరు. ఫెసిలిటేషన్ కేంద్రానికి వందమీటర్ల పరిధిలో ఎలాంటి ప్రచార కార్యకలాపాలు అనుమతించరు. ఈ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం ఆర్డీఓ మధుసూదన్ ఏర్పాట్లను పరిశీలించారు.

నియోజకవర్గం	పీఓ/ఏపీఓ	ఓపీఓ	ఎంఓ	మొత్తం	ఇతర జిల్లాల వారు
బద్వేలు	465	1416	23	1904	457
కడప	1294	1813	102	3209	1144
పులివెందుల	494	1310	31	1835	453
కమలాపురం	271	979	40	1290	337
జమ్మలమడుగు	420	1210	28	1658	467
ప్రొద్దుటూరు	774	1437	87	2298	358
మైదుకూరు	237	1084	21	1342	354
మొత్తం	3955	9249	332	13536	3570



సామాజిక న్యాయం వైఎస్ జగన్‌తోనే సాధ్యం


వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కరుణాకర్‌రెడ్డి

వేంపల్లె: సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని ఓసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆ సంఘం ప్రతినిధులతో కలిసి వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. అలాగే అక్కడ ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నమస్కరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే ఘన విజయమన్నారు. 15రోజుల నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనాలు పట్టడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసగించడానికి ఎన్నికల ప్రణాళిక పేరుతో సరికొత్త డ్రామాకు తెరతీశారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు జయవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, సభ్యులు సుబ్బారెడ్డి, ప్రదీప్ కృష్ణయ్య చౌదరి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార అవార్డు 2025కు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు, జాతీయ స్థాయిలో క్రీడలు, సంఘసేవ, సైన్స్, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్నమైన సేవలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు ఇందుకు అర్హులన్నారు. ఐదేళ్ల నుంచి జులై 31, 2024 నాటికి 18 సంవత్సరాలలోపు వయస్సుగల వారు అర్హులన్నారు. జులై 31వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీఓవీ.ఇన్/ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా


పార్టీలో చేరిన నాయకులతో ఎంపీ, ఎమ్మెల్యేలు

రైల్వేకోడూరు అర్బన్: నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని రాజంపేట ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాజు రెసిడెన్సీలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే వారం రోజులు ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేసి ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలో ప్రకటించిన మేనిఫెస్టోను ఐదేళ్లలో అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు, స్థానిక టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు ఎవరూ నమ్మవద్దని కోరారు. 2014లో చంద్రబాబు మేనిఫెస్టో ప్రకటించి దానిని ఏకంగా వెబ్ సైట్‌లో లేకుండా చేసిన చరిత్ర టీడీపీది అన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మల్లెంపల్లికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు మాచినేని మోహన్ రావు,జయంతి మాల, సుష్మిత, కోటేశ్వర, అశోక్, నాగరాజు, రహ్మతుల్లా, శ్రావణ్ కుమార్, శివ, పరశురాం, వెంకటరమణ తదితరులు పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరారు.

బత్యాల ఇలాఖాలో వంద కుటుంబాలు..

టీడీపీ నాయకుడు బత్యాల చెంగల్రాయుడు ఇలాఖా అయిన శెట్టిగుంట లక్ష్మీగారిపల్లె అరుంధతివాడకు చెందిన వంద కుటుంబాల వారు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, సాయికిషోర్ రెడ్డి, ముప్పాల హేమనవర్మ, తోట శివసాయి, సీహెచ్ రమేష్, అంబటి మురళి తదితరులు పాల్గొన్నారు.

వలస నేతలను నమ్మొద్దు

ఓబులవారిపల్లె: చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఎన్నికల కోసం హైదరాబాదు నుంచి వలస వచ్చారు.. ఎన్నికలు అయిపోగానే మళ్లీ సొంత గూటికి వెళ్లిపోతారు.. అందుకే అలాంటి వారిని నమ్మొద్దు. స్థానికంగా ఉంటూ ప్రజలకు అండగా ఉండేవారికి ఓటు వేయండి.. అని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఓబులవారిపల్లెలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కోవిడ్ కష్టకాలంలో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫామ్ హౌసుల్లో దాక్కున్నారని విమర్శించారు. ఇప్పుడు కూడా ఎన్నికలు ఉన్నందున రాష్ట్రానికి వచ్చారని, ఎన్నికలు అయిపోగానే మళ్లీ వెళ్లిపోతారన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సి ఉందన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు వైఎస్ జగన్

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


జమ్మలమడుగు/జమ్మలమడుగురూరల్: చంద్రబాబు నాయుడులో లేనిది జగన్‌మోహన్‌రెడ్డిలో ఉన్నది విశ్వసనీయత అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు.. ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది అయితే 600 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. శనివారం మైలవరం, వేపరాల, దొమ్మరనంద్యాల, మోరగుడి గ్రామాల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కరోనా సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదన్నారు. అవ్వాతాతలకు వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటి వద్దనే పింఛన్లు అందిస్తుంటే చంద్రబాబు కుట్ర ఫలితంగా నేడు అవ్వాతాతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక బీజేపీ, జనసేనతో టీడీపీ పొత్తు పెట్టుకుందన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీతో సైతం దొంగచాటుగా ఒప్పందం కుదుర్చుకుని జగన్‌ను దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

నేనేంటో ప్రజలకు తెలుసు..

తనపై కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హత్యా నేరం మోపుతున్నారని చెప్పారు. తాను ఎలాంటి వాడినో ప్రజలకు తెలుసన్నారు. తనపై అనవసరమైన నిందలు మోపినా తాను ఎప్పుడూ భయపడలేదన్నారు. ప్రజల అండదండలు తనకు పూర్తిగా ఉన్నాయన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలకు చెల్లు చీటీ పడిందన్నారు. రెండువేల నోటు లాగా ఆదినారాయణరెడ్డి కూడా ప్రస్తుతం రాజకీయాల్లో కాలం చెల్లిన వాడన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నాయకుడు సుధీర్‌రెడ్డి అన్నారు. చేనేతల సంక్షేమం కోసం వైఎస్సార్ నేతన్న నేస్తం అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపింది మన ప్రభుత్వం అన్నారు. రాబోయే రోజుల్లో ఈ పథకాలు అమలు కావాలంటే తిరిగి రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావాలన్నారు.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత 5 ఏళ్ల నుంచి ప్రజలకు అందుబాటులో లేని ఆదినారాయణరెడ్డికి ఇప్పుడు వచ్చి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డిని కాదని బీటెక్ రవికి ఆదినారాయణరెడ్డి సహకరించాడన్నారు. అప్పుడు లేని ప్రేమ ఇప్పుడు వివేకా మరణానంతరం ఆయనపై పుట్టుకురావడం శోచనీయమన్నారు. ఆయన విమర్శించారు.
- ఈ కార్యక్రమంలో ఎంపీపీ సావిత్రి, కొమెర్ల మోహన్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, హృషికేశవరెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, లీలావతి, జెడ్పీటీసీలు మహాలక్ష్మీ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కొనసాగాలంటే జగనన్న మళ్లీ రావాలి


బుద్ధా టౌన్‌షిప్‌లోని ప్రజలతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ జిల్లాలో అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక శివానందపురంలోని బుద్ధా టౌన్‌షిప్‌లోని ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, నగరపాలక సంస్థ జనరల్ ఫండ్ తప్పా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రెండేళ్లు కరోనా వల్ల కరిగిపోయినా, మిగిలిన మూడేళ్లలో వందల కోట్లు ఖర్చుపెట్టి కడపలో రహదారుల విస్తరణ, కూడళ్ల ఆధునీకరణ, డ్రైనేజీ కాలువలు నిర్మించి, రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేశామన్నారు. కేన్సర్ హాస్పిటల్, రెండు కంటి ఆసుపత్రులు, మానసిక వైద్యశాల నిర్మించడం ద్వారా వైద్యరంగంలో జిల్లాను ఒక మెట్టు పైకి ఎక్కించామన్నారు. 6వేల ఎకరాల్లో ఉన్న కొప్పర్తి పారిశ్రామిక వాడపై ముఖ్యమంత్రి జగన్‌కు ప్రత్యేక విజన్ ఉందని, అక్కడ 5 యూనిట్లు ప్రారంభమై 3వేలమంది పనిచేస్తున్నారన్నారు. రూ.200 కోట్లతో నిర్మించిన ఆ పారిశ్రామిక వాడకు బ్రహ్మంసాగర్ నుంచి ప్రత్యేక పైపులైన్ కూడా వేశామన్నారు. అది పూర్తయితే శ్రీసిటీని మించిన పారిశ్రామిక కారిడార్‌గా అవతరించడం ఖాయమన్నారు. కడప–బెంగళూరు రైల్వే మార్గాన్ని కూడా పెండ్లిమర్రి నుంచి పుట్టపర్తి వరకూ అలైన్‌మెంట్ మార్చి పూర్తి చేయాలని కేంద్రానికి ముఖ్యమంత్రి జగన్ లేఖ రాశారని త్వరలోనే అనుమతులు వస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు మాట్లాడుతూ మన జిల్లా వాసి ముఖ్యమంత్రి అయినందునే జిల్లాలో వేలకోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. జగనన్న మళ్లీ సీఎం అయితే జిల్లా రూపురేఖలను మార్చివేస్తారన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. జగనన్న చెప్పింది చేస్తాడని, చేసేదే చెబుతాడన్నారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, న్యాయవాది నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి భద్రతా చర్యల పరిశీలన


ప్రధాని బహిరంగసభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీజీ ఎస్పీ అజయ్ సింగ్

కలికిరి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 8న కలికిరిలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయన పర్యటన భద్రతా ఏర్పాట్లను స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) ఎస్పీ అజయ్ సింగ్ శనివారం పరిశీలించారు. పర్యటనలో భాగంగా స్థానిక సైనిక పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలం, సీఆర్‌పీఎఫ్ కేంద్రం ప్రధాన గేటు ముందు 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా స్థలాన్ని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి పరిశీలించి, భద్రతా చర్యలపై సూచనలిచ్చారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీజీ టీం సభ్యులు, రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐ ఆర్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హాకీలో ఉచిత శిక్షణ

రాయచోటి టౌన్: రాయచోటి రాజు హాకీ అకాడమి ఆధ్వర్యంలో హాకీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హాకీ అకాడమీ జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుకొనే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం దుకాణాల తనిఖీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లను శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత తనిఖీ చేశారు. అనంతరం ఏపీఎస్‌డీసీఎల్ డిపోలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కడప, ప్రొద్దుటూరు ప్రాంతాలల్లో పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లను తనిఖీ చేసి రికార్డులను తనిఖీ చేశామన్నారు. మద్యం దుకాణాలు, బార్లలో అధిక ధరలకు మద్యం అమ్మకుండా ఎమ్మార్పీ ధరలకే అమ్మే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మద్యం దుకాణాలు, బార్లు ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించే విధంగా చూడాలన్నారు.

హరి హర క్షేత్రం..
పుష్పగిరి

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- ఈ నెల 9 న చందనోత్సవం, 10 న అక్షయ తృతీయ , 11 న కల్యాణోత్సవాలు, 12 న రథోత్సవాలు, 14న చక్రస్నానం, పుష్పయాగం


పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రధాన గోపురం


చెన్నకేశవస్వామి


వైద్యనాథేశ్వరస్వామి

వల్లూరు: జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన పుణ్య క్షేత్రాలలో పుష్పగిరి ఒకటి. వల్లూరు మండలంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి చరిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. శివ స్వరూపుడైన వైద్యనాథేశ్వరునికి ,విష్ణు స్వరూపుడైన చెన్న కేశవునికి నిలయమైన ఈ క్షేత్రం హరి హర క్షేత్రమై శివ కేశవుల మధ్య అభేదానికి ప్రతీకగా నిలుస్తోంది. భాస్కర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పుష్పగిరిలోని వైద్యనాథస్వామి ఆలయాన్ని చోళుల కాలంలోను, చెన్నకేశవ స్వామి ఆలయాన్ని చాళుక్యుల కాలంలోనూ నిర్మించారని చరిత్రకారుల అభిప్రాయం.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

సాధారణంగా శైవ క్షేత్రాలలో ఐదు రోజులు, విష్ణు క్షేత్రాలలో తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం పరిపాటి. కానీ పుష్పగిరిలో శివ కేశవులిద్దరికీ 9 దినాల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతి కార్యక్రమంలోనూ సాక్షాత్తూ శ్రీరామ చంద్రునిచే పూజలందుకున్న శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామికి ముందుగా పూజలు నిర్వహించి, అనంతరం శ్రీ లక్ష్మీ చెన్న కేశవునికి పూజలు నిర్వహిస్తారు. ఈ నెల 5 వ తేదీ నుండి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలలో 9 వ తేదీన జరిగే చందనోత్సవానికి, 10 న అక్షతదియలో భాగంగా జరిగే గరుడవాహన సేవకు, 11 న జరిగే రెండు కళ్యాణోత్సవాలకు , 12 న జరిగే రెండు రథోత్సవాలకు , బ్రహ్మోత్సవాల ముగింపు రోజైన 14 వ తేదీన జరిగే చక్రస్నానం, పుష్పయాగాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ దినాలలో భారీ సంఖ్యలో భక్తులు రాష్ట్రం నలుమూలల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా తరలి వస్తారు.

- శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరునికి ఈ నెల 5 న సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, ప్రధాన అర్చకుడు పి. అఖిల్ దీక్షితులు తెలిపారు. 6 న ఉదయం రుద్రాభిషేకం, కుంకుమార్చన, అగ్ని ప్రతిష్ఠాపన, నవ కళశ స్థాపన, ధ్వజారోహణం జరుగుతాయి. సాయంత్రం హంస వాహన సేవ ఉంటుంది. 7న అభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం సింహవాహన సేవ ఉంటుంది. 8న కుంకుమార్చన, నిత్య హోమం జరుగుతాయి. సాయంత్రం పురుషాన్ మృగ వాహన సేవ నిర్వహిస్తారు. 9న సాయంత్రం మయూర వాహన సేవ, 10 న అక్షయ తృతీయ, రాత్రి నంది వాహన సేవ ఉంటుంది. 11న ఉదయం 10 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథులకు కళ్యాణోత్సవం జరుగుతుంది. రాత్రి గజవాహన సేవ జరుగుతుంది. 12న ఉదయం 10 గంటలకు వైద్యనాథ స్వామి రథోత్సవం, 13న సాయంత్రం అశ్వవాహన సేవ, 14 న త్రిశూల స్నానం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం రావణేశ్వర వాహన సేవ జరుగుతాయి.
- శ్రీ లక్ష్మీచెన్న కేశవ స్వాములకు 5 న విష్వక్సేన పూజ, మేదినీ పూజ, అంకురార్పణ జరుగుతాయి. 6 న ఉదయం తోమాలసేవ, రాత్రి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠాపనం, నవ కళశ స్థాపన, నవ కుంభారోహణ, ధ్వజారోహణం, భేరీ పూజ, పంచ సూక్త హోమం జరుగుతాయి. రాత్రి తిరుచ్చి వాహన సేవ ఉంటుంది. 7 న రాత్రి హంస వాహన సేవ , 8 న ఉదయం అష్టోత్తర కళశాభిషేకం, రాత్రి యాళీ వాహన సేవ ఉంటుంది. 9 న ఉదయం స్వామి వారికి చందనోత్సవం, రాత్రి హనుమంత వాహన సేవ, 10 న అక్షయ తదియ రోజు ఉదయం పూలంగి సేవ, రాత్రి 11.30 గంటల నుంచి గరుడ వాహన సేవ ఉంటుంది. 11 న ఉదయం పంచామృత స్నపన తిరుమంజనం, సాయంత్రం 7 గంటలకు శ్రీ దేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కళ్యాణం జరుగుతుంది. రాత్రి గజ వాహన సేవ నిర్వహిస్తారు. 12 న సాయంత్రం 4.30 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్న కేశవస్వామి రథోత్సవం జరుగుతుంది. 13 న రాత్రి అశ్వవాహన సేవ, 14 న తీర్థవాసి చక్ర స్నానం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం, సాయంత్రం 4.30 గంటలకు పుష్పయాగం, 7 గంటల నుంచి తిరుచ్చి వాహన సేవ జరుగుతాయి.

ముక్తియార్‌పై చర్యలేవీ!


టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డితో పాటు ప్రచారం చేస్తున్న వీఎస్ ముక్తియార్

ప్రొద్దుటూరు : దాడి కేసులో నిందితుడుగా ఉన్న టీడీపీ మున్సిపల్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్ యధేచ్ఛగా రోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు. పోలీసులు వెంటనే ముక్తియార్‌ను అరెస్టు చేయాలని బాధితులు కోరుతున్నారు. స్థానిక వెంగళరెడ్డిపేటకు చెందిన కోగటం అమీర్ హంజాపై ఈ ఏడాది ఫిబ్రవరి 26న పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌కు పిలిపించుకుని దాడి చేశారు. ఆ సమయంలో అక్కడ మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, సీఎం సురేష్ నాయుడుతోపాటు ఇతరులు ఉన్నారు. ఆ సందర్భంగా అమీర్ హంజాను ముక్తియార్ నానా దుర్భాషలాడి మారణాయుధాలతో దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి అమీర్ హంజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముక్తియార్‌తోపాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంత వరకు ముక్తియార్‌తోపాటు మిగతా వారిని పోలీసులు అరెస్టు చేయని సంగతి అటుంచితే బహిరంగంగా రోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిందితులను అరెస్టు చేయాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నాడు.

మానవత్వం చాటుకున్న 'భారతి'



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వాటర్ కూలింగ్ మిషన్..మేస్త్రీలకు శీతల పానీయాలు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ప్రొద్దుటూరు : మండు వేసవిలో భవన నిర్మాణ కార్మికులకు శీతల పానీయాలను అందించి భారతి సిమెంటు యాజమాన్యం మానవత్వాన్ని చాటుకుంది. ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో పలు చోట్ల పనిచేస్తున్న తాపీ మేస్త్రీలకు శీతల పానీయాలు అందించడంతో పాటు జిల్లా ఆస్పత్రిలో కూలింగ్ వాటర్ మిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారతి సిమెంటు కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ కె.నాగేంద్ర మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీతో భారతి సిమెంటు తయారవుతుందని తెలిపారు. శ్లాబ్‌కు అన్ని విధాలా తమ సిమెంటు అనుకూలంగా ఉంటుందన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ చిన్న శ్రీకాంత్ రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

భవిష్యత్తు అంతా టెక్నాలజీదే: రీతూశర్మ

కురబలకోట: టెక్నాలజీపై పట్టున్న వారిదే భవిష్యత్తు అని కొత్త నైపుణ్యాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని బెంగళూరు బ్రిల్లియో టెక్నాలజీస్ మోటివేటర్ రీతు శర్మ అన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటింగ్, ఇంటిలిజెంట్ సిస్టమ్స్‌పై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. టెక్నాలజీ నానాటికి కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. మారుతున్న కాలంతో పాటు సమాజంలో ఆలోచనలు, అవసరాలు, మార్పులు అనివార్యమన్నారు.

బీజేపీ వస్తే దేశమంతా 'మణిపూరే'



దేశ ఆర్థిక పరిస్థితి..మన భవిష్యత్తు సదస్సులో మాట్లాడుతున్న ఆర్థిక విశ్లేశకులు పరకాల ప్రభాకర్

కడప రూరల్ : కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే మణిపూర్‌లో జరిగిన మారణహోమం దేశ వ్యాప్తంగా జరిగే అవకాశం ఉందని రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ అన్నారు. శనివారం సాయంత్రం కడప నగరంలోని ఐఎంఏ హాల్‌లో కడప సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో దేశ ఆర్థిక పరిస్థితి.. మన భవిశ్యత్తు అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పరకాల ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ కూటమి దేశం ఐదవ ఆర్థిక శక్తిగా ఎదిగిందని గొప్పలు చెప్పుకుంటోందని అన్నారు. అలాంటప్పుడు దేశ ప్రధాని మోదీ దేశంలోని 82 కోట్ల మంది నిరుపేదలకు ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం ఇస్తామని చెప్పడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. 2022వ సంవత్సరంలో కేంద్ర ప్రకటించిన ఒక ఉద్యోగ ప్రకటనకు 1.25 కోట్ల దరఖాస్తులు రావడం చూస్తే నిరుద్యోగ సమస్య దేశంను ఎంతగా పీడించేది అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు ప్రపంచ ఆకలి సూచకలో భారత్ అట్టడుగు స్థానంలో ఉందని ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. అలాంటప్పుడు దేశం ఐదవ ఆర్థిక శక్తిగా ఎదిగిందని చెప్పడంలో అర్థం లేదన్నారు. ఢిల్లీలో నిర్వహించిన జీ–20 సదస్సును కోట్లాది రూపాయలు వెచ్చించారన్నారు. దేశాధినేతలకు పేదలు కనపడకుండా రోడ్లకు ఇరువైపులా పరదాలు కట్టడం ఏ అభివృద్ధికి కొలమానమన్నారు. జీ–20 సదస్సు కేవలం మోదీని విశ్వ గురువుగా అవతరించారని చెప్పుకోవడానికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం ప్రపంచంలోనే పెద్ద స్కాం అని అన్నారు. కార్యక్రమంలో కడప సిటిజన్స్ ఫోరం సభ్యులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, కుమారస్వామి, భాస్కర్, లక్ష్మీరాజ, వైద్యులు, విద్యావేత్తలు, మేధావులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పింఛన్


వేంపల్లెలోని స్టేట్ బ్యాంకులో పింఛన్ నగదు కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

బి.కోడూరు/ప్రొద్దుటూరు : పింఛన్ డబ్బులు వృద్ధుల ప్రాణంమీదికొస్తున్నాయి. చంద్రబాబు పుణ్యమా అని వలంటీర్ల వ్యవస్థ దూరం కావడంతో పింఛన్ నగదు బ్యాంకుల్లో జమ అయింది. ఈ డబ్బును తీసుకోవడానికి వృద్ధులు నానాయాతన పడుతున్నారు. కొందరు ఎండలకు అల్లాడుతుంటే.. మరికొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీ రోడ్డులో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు వద్ద వృద్ధులు శనివారం పడిగాపులు కాశారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఎక్కువ శాతం మంది పింఛన్‌దారులకు ఐసీఐసీఐ బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేశారు. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ ఉన్న కారణంగా ఆ బ్యాంకు ఖాతాలున్న విషయాన్నే వృద్ధులు మరిచిపోయారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి సుమారు 3వేల పింఛన్లు ఈ బ్యాంకులో ఉండగా.. దువ్వూరు, ఎర్రగుంట్ల ప్రాంతాల నుంచి కూడా ఆటోలు వేసుకుని లబ్ధిదారులు నానా తంటాలు పడి ఇదే బ్యాంక్‌కు రావాల్సి వచ్చింది.

వడదెబ్బతో మృతి..


మృతి చెందిన వృద్ధుడు గురివిరెడ్డి

బి.కోడూరు మండలంలోని మరాటిపల్లె గ్రామానికి చెందిన గోనెగురివిరెడ్డి (75) అనే వృద్ధుడు వడదెబ్బతో మృతిచెందాడు. గురువారం నుంచి పింఛన్ కోసం గురివిరెడ్డి సచివాలయానికి వెళ్ళగా వారు బ్యాంకులో జమ అయినట్లు తెలిపారు. దీంతో శుక్రవారం ఆ వృద్ధుడు బద్వేలు స్టేట్ బ్యాంకుకు మండుటెండలో వెళ్లి చూసుకోగా బ్యాంకు వారు జమ కాలేదని తెలపడంతో అక్కడి నుంచి తిరిగి బి.కోడూరు ఏపీజీబీ బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకు వారు అకౌంట్‌లో నగదు జమ అయిందని, డ్రా చేసేందుకు బ్యాంక్ సమయం అయిపోయిందని తెలపగా అక్కడే అందుబాటులో ఉన్న మీసేవ కేంద్రంలో ఆధార్ అనుసంధానంతో నగదు తీసుకుని సాయంత్రానికి ఇంటికి చేరుకున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుటెండలో వృద్ధుడు తిరగడంతో వడదెబ్బ సోకి శుక్రవారం రాత్రి మృతిచెందాడు.

చాపాడు


వడదెబ్బతో మృతి చెందిన వృద్ధురాలు

చాపాడుమండల పరిధిలోని రాజుపాళెం గ్రామానికి చెందిన ఆదిమూలం ఓబుళమ్మ (70) అనే వృద్ధురాలు పంచాయతీ కేంద్రమైన వెదురూరు గ్రామానికి రెండు రోజులుగా తిరుగుతోంది. సీఎస్పీ వద్ద వేలి ముద్ర ద్వారా డబ్బులు తీసుకోవడానికి వెళ్లగా ఐసీఐసీఐ బ్యాంకులో పింఛన్ నగదు జమ అయిందని ప్రొద్దుటూరుకు వెళ్లాలని సీఎస్పీ సూచించాడు. అప్పటికే వడ దెబ్బకు గురైంది. శనివారం మధ్యాహ్నం ఇంటి వద్ద సొమ్మసిల్లి పడిపోవడంతో కుటుంబీకులు ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే వృద్ధురాలు మృతి చెందినట్లుల వైద్యులు నిర్ధారించారు.

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలోని సోగాల్ పల్లె గ్రామానికి చెందిన కొండూరు వెంకటన్న(65) అను వృద్ధుడు పింఛన్ డబ్బుల కోసం మూడు రోజులు తిరిగి శనివారం వడదెబ్బకు గురై మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. వెంకటన్నకు పింఛన్ డబ్బులు బ్యాంక్ అకౌంట్‌లో వేశామని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామసచివాలయ సిబ్బంది చెప్పడంతో నందిమండలం బ్యాంక్ వద్దకు వెళ్లాడు. అక్కడ బ్యాంక్ సిబ్బంది డబ్బులు అకౌంట్‌లో జమ కాలేదని చెప్పడంతో తిరిగి సచివాలయానికి వెళ్లాడు. ఇలా మూడు రోజుల పాటు పింఛన్ డబ్బుల కోసం తిరగడంతో వడదెబ్బకు గురై మృతి చెందాడు.


కొండూరు వెంకటన్న (ఫైల్)

వడదెబ్బతో వృద్ధుడు మృతి


వడదెబ్బతో మృతి చెందిన రాఘవరెడ్డి

పులివెందుల : పులివెందుల మండలం ఎర్రంరెడ్డిపల్లెకు చెందిన వి.రాఘవరెడ్డి (75) మృతి చెందాడు. పింఛన్ కోసం శుక్రవారం పులివెందుల మండలంలోని ఏపీజీబీకి వెళ్లాడు. అక్కడ ప్రజలు అధికంగా ఉండడంతో బ్యాంకు ఎదుట వేచి ఉండడంతో వడదెబ్బ తగిలింది. ఈ క్రమంలో శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చాలా ఇబ్బందులు పడ్డాను



చంద్రబాబు చేసిన పనితో ఫించన్ కోసం చాలా ఇబ్బందులు తప్పడం లేదు. ఆపసోపాలు పడి బ్యాంకులకు వెళితే డబ్బులు పడలేదని చెప్పారు. అక్కడ నుంచి మండుటెండల్లో ఉసూరుమంటూ ఇంటికి వచ్చాను. మొన్నటిదాకా జగనన్న దయతో ఇంటి వద్దనే పింఛన్ తీసుకునేవాళ్లం. తెల్లవారక ముందే తలుపుతట్టి వలంటీర్లు పింఛన్ నగదు అందజేసేవారు.

– నామ వెంకటసుబ్బమ్మ (ఫించన్‌దారురాలు), గౌరీ నగర్, వేంపల్లె

వైఎస్ఆర్‌సీపీలోకి 70 మైనార్టీ కుటుంబాలు

చింతకొమ్మదిన్నె: చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని లక్కిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీలు శనివారం టీడీపీని వీడి వైఎస్ఆర్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ హుసేన్, షేక్ మహమ్మద్ బాషా, షేక్ రహమతుల్లా, షేక్ నాయబ్ బాషా, షేక్ ఖాజా, షేక్ దర్బార్, ఎస్ బాషా, సయ్యద్ సిద్ది నాయబ్ రసూల్, సయ్యద్ ఖలీల్, సయ్యద్ మస్తాన్, షేక్ మన్సూర్ , షేక్ షబ్‌నూర్, షేక్ ఫక్రుద్దీన్, అబ్దుల్, సయ్యద్ మదార్ వలీ, షేక్ దౌలత్, షేక్ ఇమ్‌దాద్, షేక్ అబ్దుల్ రెహమాన్, షేక్ రహీం, షేక్ మహబూబ్ బాషా, షేక్ సైఫుల్లా, ఎస్ మౌళాలి మొదలైన 70 మైనార్టీ కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ మేరకు గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి వారికి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ నేతలు శ్రీనివాసులు రెడ్డి, హిదాయతుల్లా, నాయబ్ పాల్గొన్నారు.


మైనార్టీ సోదరులకు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరిక

పార్టీలోకి ఆహ్వానించిన యువరాజ్‌రెడ్డి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న యువరాజ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : స్థానిక పాతహాలు వీధికి చెందిన దాదాపు వంద కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. శనివారం వైఎస్సార్‌సీపీ నేతలు ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి, రవికుమార్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, గాయత్రిల సమక్షంలో మాజీ ఉపసర్పంచ్ మునీర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేత యువరాజ్ రెడ్డి ఆ కుటుంబాలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. షేక్షా, మస్తాన్, మహమ్మద్‌అలీ, గఫార్, అజీజ్, యాకూబ్, బాబావలి, అబ్దుల్, జాఫర్, దర్బార్, ఆజాద్, ఫాజిల్, మాబాషా వీరితో పాటు ఎస్ జేబి కూల్‌డ్రింక్స్ జిన్నా, కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఐదేళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. అందుకు ఆకర్షితులై పార్టీలోకి చేరామన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.